ప్రజాశక్తి
శనివారం 31 డిసెంబరు 2022

రాజకీయ జోరు... అసమ్మతి హోరు

- పలురకాల కార్యక్రమాలతో జనంలోకి పాలక, ప్రతిపక్ష పార్టీలు
- రెండు పార్టీలకూ తప్పని అసమ్మతి పోరు
- ప్రజా సమస్యలపై వామపక్షాల ఉద్యమబాట

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఈ ఏడాదిలో పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించాయి. మేలో గడపగడపకూ మన ప్రభుత్వం పేరుతో వైసిపి జనంలోకి వెళ్లగా, దానికి ధీటుగా టిడిపి బాదుడే బాదుడు కార్యక్రమంతో జనంలో ఉండేందుకు ప్రయత్నించింది. ఏడాది చివరిలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి పేరుతో టిడిపి చేపడితే... కన్వీనర్లు, గృహ సారథులతో ప్రతి ఇంటినీ సందర్శించేలా వైసిపి ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. ఏడాది ప్రథమార్థంలో నెమ్మదిగా సాగిన రాజకీయ కార్యకలాపాలు ద్వితీయార్థంలో ఊపందుకున్నాయి. ఇరు పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించిన మాదిరిగానే ఆయా పార్టీల్లోని అసమ్మతి కూడా వేర్వేరు కుంపట్లు పెట్టి సమాంతర కార్యక్రమాలు చేపట్టారు.





వైసిపి నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు చేదు అనుభవాలను చవిచూశారు. ఎచ్చెర్ల, పాతపట్నం, పలాస, ఆమదాలవలస నియోజకవర్గాల్లో తాగునీరు, అధ్వాన్న రోడ్ల పరిస్థితిపై నాయకులను ప్రజలు నిలదీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలో మొదటి విడతలో ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎచ్చెర్ల, పాతపట్నం ఎమ్మెల్యేలు, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ఇన్‌ఛార్జీల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో వెనుకబడ్డారంటూ మందలించారు. గడప గడపకూ కార్యక్రమ పర్యవేక్షణకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను నియమించినా, వారు నామమాత్రంగా మారారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజుకు ఈ ఏడాది పరిస్థితి అంతగా బాగాలేదు. పనితీరుపై ముఖ్యమంత్రి జగన్ రెండో విడత ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రకటించిన జాబితాలో మంత్రి అప్పలరాజు ఉన్నారు. వచ్చే మార్చి నాటికి మార్పు కనిపించకపోతే మారుస్తామంటూ హెచ్చరికలు సైతం జారీ చేశారు. పలాస నియోజకవర్గంలో మంత్రిని వ్యతిరేకిస్తున్న వారంతా ఒక్కటై తిరుగుబావుటా ఎగురవేశారు. నియోజకవర్గంలో అసమ్మతి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వ్యతిరేకంగా ర్యాలీలు, సమావేశాలు, పోటాపోటీగా ఆమదావలసలోనే పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేలకు తప్పని గ్రూపుల పోరు

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తీరుపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇక్కడా గ్రూపుల పోరు కొనసాగుతోంది. సొంత కుటుంబ సభ్యులే కిరణ్‌కు ఎదురుతిరిగి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు నెరపుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోనూ కుమ్ములాటలు ఉన్నాయి. ఎమ్మెల్యే రెడ్డి శాంతి వ్యవహార శైలిపై మండిపడుతూ వేరే కుంపటి పెట్టారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ కోసం సైతం ప్రయత్నిస్తున్నారు.

టిడిపిలో పోటాపోటీ కార్యక్రమాలు

టిడిపి ప్రజా సమస్యలు కన్నా రాజకీయంగా ప్రయోజనం కలిగించే అంశాలనే కార్యక్రమాలుగా చేపట్టింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలలు అడపాదడపా కార్యక్రమాలు చేపట్టిన ఆ పార్టీ ద్వితీయార్థంలో దూకుడు పెంచింది. ఇందులో బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ రాష్ట్రానికి వంటి కార్యక్రమాలలో జనంలోకి విస్తృతంగా వెళ్లింది. చింత చచ్చినా పులుపు చావలేదన్న చందంగా ఆ పార్టీలో గ్రూపుల పోరు కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పాటపట్నం నియోజవర్గాల్లో ఈ పరిస్థితి కనిపించింది. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఒకవైపు పార్టీ కార్యక్రమాలతో జనాల్లోకి వెళ్తుంటే, దానికి పోటీగా టిడిపి నాయకుడు గొండు శంకర్ పరామర్శలు, ఆర్థికసాయం పేరుతో కొందరు టిడిపి నాయకులను వెంటబెట్టుకుని కార్యకర్తల ఇళ్లకు వెళ్లారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించారు. పాతపట్నంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరావుకు సమాంతరంగా మామిడి గోవిందరావు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సొంత జిల్లాలో వాటిని చక్కదిద్దకపోవడంతో ఈ మూడు నియోజకవర్గాల్లో వేర్వేరు కుంపట్లు కొనసాగుతున్నాయి.

ధర్మానకు పదవీ యోగం

ఈ ఏడాది ఏప్రిల్‌లో చేపట్టిన కేబినెట్ విస్తరణలో జిల్లాకు సంబంధించి కొన్ని కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి మంత్రి పదవిని ఆశిస్తున్న ధర్మాన ప్రసాదరావుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెవెన్యూశాఖను కట్టబెట్టారు. సీదిరి అప్పలరాజును మంత్రిగా కొనసాగిస్తూ అదే మత్స్య, పశుసంవర్ధక శాఖను అప్పగించారు. అప్పటివరకు డిప్యూటీ సిఎం, రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన కృష్ణదాస్‌కు పార్టీ జిల్లా పగ్గాలు అప్పగించారు.

ప్రజా సమస్యలపై వామపక్షాల ఉద్యమబాట

సిపిఎం, ఇతర వామపక్షాలు తమ సహజ పంథాలో నిరంతరం ప్రజా, కార్మిక, రైతాంగ సమస్యలపై పోరు సల్పాయి. భావనపాడు పోర్టు భూములను ప్రభుత్వం బలవంతంగా సేకరించడం, పోలీసు బలగాల సాయంతో ఇళ్ల సర్వే చేసి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సందర్భంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు ఆ గ్రామాన్ని సందర్శించి వారికి భరోసా కల్పించారు. ఒడిశా అంగూల్ నుంచి శ్రీకాకుళం నగరంలోని బలగ వరకు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మిస్తున్న పైపులైన్ పనులకు సేకరిస్తున్న భూములకు నామమాత్రంగా పరిహారం చెల్లింపులపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మధు వేర్వేరు సందర్భాల్లో మందస ప్రాంతాన్ని సందర్శించి రైతులకు అండగా నిలిచారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో నారాయణపురం భూముల నుంచి అధికార పార్టీ నాయకులు రైతులను వెళ్లగొట్టి వారికి అన్యాయం చేసిన సమయంలో, వారిరువురూ వేర్వేరు సందర్భాల్లో పర్యటించి భరోసా కల్పించారు. ఈ ఏడాది కాలంలో ఇటువంటి ఎన్నో ప్రజా పోరాటాల్లో సిపిఎం, వామపక్షాలు పాల్గొని ప్రజలకు అండగా నిలిచాయి.

వంశధార కాలువలకు కొత్త షట్టర్లు

- సిపిఎం డిమాండ్
- శివారు భూములకు అందని సాగునీరు
- రైతుల అవస్థలను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వంశధార కాలువలకు కొత్త షట్టర్లు వేసి శివారు భూములకు సాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 50 ఏళ్ల కిందట వేసిన షట్టర్లు పూర్తిగా పాడైపోవడంతో వంశధార కాలువల శివారు భూములకు నీరందకపోవడంతో రైతులు పంటలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, 2009 నాటికే షట్టర్లు పాడైపోవడం వల్ల కొత్త షట్టర్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. కొనుగోలులో అవకతవకల పేరుతో 970 టన్నుల మెటీరియల్ 12 ఏళ్లుగా గోదాములో తుప్పు పట్టి ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. షట్టర్ల కేసు కోర్టులో ఉండడంతో, కోర్టు అనుమతితో వాటిని వినియోగించుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రస్తుతం 513 షట్టర్లు పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. దీంతో నీటి కోసం రైతులు తాటి దుంగలు, ఇసుక బస్తాలు, గుర్రపుడెక్క అడ్డుపెట్టుకొని నీరు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని ప్రచారం చేసుకుంటున్న వైసిపి ప్రభుత్వానికి షట్టర్ల వ్యవహారం పట్టదా అని ప్రశ్నించారు. 300 మంది లష్కర్లు అవసరం కాగా, ప్రస్తుతం 70 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. వారికీ నాలుగు నెలలు మాత్రమే జీతాలు ఇస్తున్నారని చెప్పారు. కాలువల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. వచ్చే పంట కాలం నాటికి షట్టర్ల ఏర్పాటు పూర్తి చేసి కాలువ శివారు భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

వీరగున్నమ్మ చరిత్ర అందరికీ తెలియాలి

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

ఉత్తరాంధ్ర ధీర వనిత సాసుమాను వీర గున్నమ్మ జీవిత చరిత్ర ప్రజలందరికీ తెలియాల్సిన అవసరముందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం వీరగున్నమ్మపురంలో 'విప్లవ సేనాని వీరగున్నమ్మ' చిత్రానికి సంబంధించిన పోస్టర్‌తో పాటు పాట, ట్రైలర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరగున్నమ్మ సినిమా మాత్రమే కాదని, దశాబ్దాల మన ప్రాంత చరిత్ర అని అన్నారు. వీరగున్నమ్మ వీరోచిత పోరాటం ఇతివృత్తంగా సాగే రానున్న తరాలకు అందించడం బాధ్యతగా ఈ చిత్రాన్ని నిర్మించారని తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంత వీరోచిత పోరాటాలను దేశవ్యాప్తంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంత చరిత్రకు సంబంధించిన మరిన్ని చిత్రాలు రావాల్సి ఉందని తెలిపారు. చిత్ర దర్శకుడు దర్శక నిర్మాత గూన అప్పారావు మాట్లాడుతూ ఈ ప్రాంత చరిత్ర చిత్రంగా రూపొందించడంలో ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో సహకరించారని తెలిపారు. ప్రజల్లో నాటి పోరాట స్ఫూర్తి నేటికీ సజీవంగా కొనసాగడం అభినందనీయమన్నారు. వీరగున్నమ్మపురం సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో మందస ఎంపిపి డి.దానయ్య, జెడ్‌పిటిసి సవర కుమారి, వైస్ ప్రెసిడెంట్ కె.ఆదినారాయణ, వీర గున్నమ్మ తండ్రి పాత్రధారి ఎల్.వి చలం, దుంపల వైకుంఠరావు, చింతాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పలరాజు, తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికి తోడ్పాటు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. వారికి అన్నివిధాలుగా జిల్లా యంత్రాంగం, పోలీసు, సంబంధిత శాఖలు తోడ్పాటును అందిస్తున్నామని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసుల్లో ఇప్పటివరకు రూ.1.21 కోట్ల పరిహారాన్ని బాధితులకు అందించినట్లు వివరించారు. నగరంలోని బాబూ జగ్జీవన్‌రామ్ ఆడిటోరియం నిర్మాణానికి వాంబే కాలనీలోని సర్వే నంబరు 703/1లో ఏడు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థి తల్లికి కొల్లివలస గురుకుల పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన అటెండర్ ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. దళ్లవలస ఎస్‌సి కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డును వేరే చోటుకు మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బిసి స్టడీ సర్కిల్ తరహాలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకూ ఒక స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా హాస్టల్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. రిమ్స్‌లో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీగార్డు పోస్టుల అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో రోస్టర్ విధానాన్ని అమలు చేయడం లేదని సభ్యులు కమిటీ ముందుంచారు. తక్షణమే రోస్టర్ అమలుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గతంలో రుణాలను మంజూరు చేసేవారని, ప్రస్తుతం అమలు కావడం లేదని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డిఎస్‌పిలు మహేంద్ర, శివరాంరెడ్డి, డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డీడీ ఆర్.గడ్డెమ్మ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కె.రామారావు, ఆర్‌డిఒలు బొడ్డేపల్లి శాంతి, సీతారామ్మూర్తి, ప్రభుత్వ పురుషుల, మహిళల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పి.సురేఖ, కె.శ్రీరాములు, కమిటీ సభ్యులు కె.వేణు, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా నగదు రహిత చికిత్స

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యశ్రీ పథకంలో చేరిన తర్వాత రోగులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండకూడదని, నగదు రహిత చికిత్స ప్రాథమిక నియమమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా క్రమశిక్షణా సంఘ సమావేశం, వైద్యాధికారుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద నగదు రహిత చికిత్సను అందించాల్సిన బాధ్యత ఆస్పత్రులపై ఉందన్నారు. ఒపి నుంచి ఐపికి మార్చినప్పుడు పెండింగ్‌లో ఉన్న అన్నింటినీ క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. రోగుల ప్రాథమిక అవసరాలనూ తీర్చాలన్నారు. ఆహారం, పారిశుధ్యం విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఆహారంలో వారానికి కనీసం రెండుసార్లు గుడ్లు, రోజూ ఒక పండు అందించాలన్నారు. కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు బాగా పనిచేస్తున్నాయని, మరికొన్ని మెరుగుపడాల్సి ఉందన్నారు. రోజుకు మూడు సార్లు శుభ్రపరచడానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. చాలా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోజుకు రెండుసార్లు చేస్తున్నారని, మూడుసార్లు చేయాలని స్పష్టం చేశారు. అన్ని ఆస్పత్రుల్లో ఇప్పుడు 3,255 విధానాలు ఉన్నాయన్నారు. కొత్త కియోస్క్‌లు 32 ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులకు ఇవ్వబడ్డాయని చెప్పారు. వాటి కోసం ఆస్పత్రులు సరైతన స్థలాన్ని కేటాయించాలని, సరైన నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో డిడిసి ఉందని, ఇప్పటికే నెట్‌వర్క్ ఆస్పత్రులకు తెలియజేశామన్నారు. మోసపూరిత కార్యకలాపాల నియంత్రణ కోసం మానిటరింగ్ టీమ్ లేవనెత్తిన ఫిర్యాదులను సంఘం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి జె.భాస్కరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.ప్రకాశరావు, జెమ్స్ ప్రాంతీయ ఆరోగ్య అధికారి ప్రవీణ్, కిమ్స్ పర్యవేక్షకులు కృష్ణమోహన్, ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రాష్ట్రంలో విధ్వంసకర పాలన

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో విధ్వంసకర, విద్వేష పాలన సాగుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న 'యువగళం' పాదయాత్ర పోస్టర్‌ను నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టిడిపి హయాంలో రూ.నాలుగు లక్షల కోట్ల విలువైన పరిశ్రమలు స్థాపించామని, మరో రూ.1.74 లక్షల కోట్ల పరిశ్రమలకు అనుమతులు ఉన్నా, జగన్ విధ్వంసకర పాలనతో రాష్ట్రం నుంచి తరలిపోయాయని తెలిపారు. విశాఖలో కార్యనిర్వాహక రాజధానిని ఏర్పాటు చేస్తామని చెప్తున్న సిఎం జగన్, పరిశ్రమలు వెనక్కి ఎందుకు వెళ్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల మంది నిరుద్యోగులు ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను 44 నెలలుగా భర్తీ చేయలేదన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్యకు కోత పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు, వారికి బాసటగా నిలిచేందుకు నారా లోకేష్ జనవరి 27నుంచి చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, జిల్లా అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, నాయకులు సింతు సుధాకర్, చిట్టి మోహన్, శీర రమణయ్య, ఉంగటి రమణ, జామి భీమశంకరరావు, బలగ చెంగలరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్, టిడిపి నాయకులు

చౌకధరల దుకాణాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని పలు చౌక ధరల దుకాణాలను జిల్లా అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పౌర సరఫరాల శాఖ, కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగరంలోని పెద్ద రెల్లివీధిలోని చౌక ధర దుకాణాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తనిఖీ చేయగా, మంగువారితోటలోని చౌక ధర దుకాణాన్ని తహశీల్దార్ ఎన్.వెంకటరావుతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి, సరుబుజ్జిలిలోని రేషన్ డిపోను డిఆర్‌డిఎ పీడీ జి.వి చిట్టిరాజు, ఎచ్చెర్ల మండలంలోని చిలకపాలెం-1 డిపోను పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, బర్మా కాలనీ తుమ్మావీధిలోని చౌక ధర దుకాణాలను జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి.రమణ, చంపాగల్లి వీధిలోని డిపోను ఐసిడిఎస్ పీడీ కె.ఆదిత్యలక్ష్మి తనిఖీ చేశారు. రేషన్ సకాలంలో పంపిణీ చేయాలని, సరైన తూకంతో సక్రమంగా సరుకులు అందించాలని డీలర్లకు సూచించారు. రేషన్ లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.



రేషన్ డిపోను తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ శాంతి

నేడు టిటిడిసిలో శిక్షణ, ఉపాధి నియామకాలు

శ్రీకాకుళం : సీడాప్, డిఆర్‌డిఎ ఆధ్వర్యాన ఎచ్చెర్లలోని టిటిడిసిలో స్కిల్ కాలేజీలో ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్‌లో శిక్షణ, ఉపాధి కోసం నియామక ఎంపికల కార్యక్రమాన్నిఈనెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డి.వి విద్యాసాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిఎస్‌సి (సిబిజెడ్, బయోటెక్నాలజీ, హోం సైన్స్, నర్సింగ్, బిహెచ్ఎంఎస్, బిఎఎంఎస్, బియుఎంఎస్, బిపిటి), ఎంఎస్‌సి (సోషల్ వర్క్ ఫిచియాట్రీ, సోషియాలజీ, పబ్లిక్‌హెల్త్) అభ్యర్థులతో పాటు గ్రాడ్యుయేట్ (నర్సింగ్, ఇతర హెల్త్ కోర్సులు, లైఫ్ సైన్స్ తదితర) కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు నాలుగు నెలల శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి, రెండు జతల యూనిఫారాలు, శిక్షణా మెటీరియల్, ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు బయోడేటా, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

ఏప్రిల్ 3 నుంచి 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పదో తరగతి పరీక్షలను ఏప్రిల్ మూడు నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 3న ప్రథమ భాష (గ్రూప్-ఎ), 6న ద్వితీయ భాష, 8న ఆంగ్ల పరీక్ష, 10న లెక్కలు, 13న సామాన్య శాస్త్రం, 15న సాంఘిక శాస్త్రం, 17న ప్రథమ భాష (పార్ట్- 2), 18న ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

ప్రజావసరాలకు అనుగుణంగా ప్రణాళికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్థానిక సంస్థల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో ఆర్థిక, భౌతిక, మానవ వనరుల వినియోగంపై శ్రద్ధ చూపడం ద్వారా ప్రజల మౌలిక అవసరాలు తీర్చడానికి వీలుంటుందని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆ దిశగా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లాపరిషత్ పనిచేయాల్సి ఉందన్నారు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో క్షేత్రస్థాయి ఉద్యోగుల శిక్షణా కార్యక్రమాన్ని జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టికల్ 243ను అనుసరించి స్థానిక సంస్థలకు విశేష అధికారాలు ఉన్నాయని తెలిపారు. 29 ప్రభుత్వ శాఖలతో కూడిన అభివృద్ధి ప్రణాళికలను ప్రజల భాగస్వామ్యంతో ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా స్థానిక ప్రభుత్వాలు తయారు చేసుకోవాలన్నారు. రక్షిత మంచినీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, వీధిదీపాలు, ప్రాథమిక విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయం, పశుపోషణ, నీటి వనరుల సంరక్షణ, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి ప్రణాళికల్లో పొందుపరచాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు జెడ్‌పి సిఇఒ, డిపిఆర్‌సి బాధ్యత తీసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా సమన్వయకర్త రాజు, జెడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి హుండీ ఆదాయం రూ.59 లక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీల ద్వారా రూ.59 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయంలోని అనివెట్టి మండపంలో శుక్రవారం చేపట్టిన హుండీ లెక్కింపులో రూ.59,34,463 నగదు, 20 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, రెండు కిలోల 500 గ్రాముల వెండి కానుకలు, ఆరు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ లభ్యమయ్యాయి. ఈ ఏడాది నవంబరు 10 నుంచి ఈనెల 30వ తేదీ మధ్యన ఈ ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. నోట్ల రూపంలో రూ.57,21,078, నాణేల రూపంలో రూ.2,13,385 ఆదాయం వచ్చింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ క్వార్టర్ దీనార్, సౌదీ అరేబియా 1 రియల్, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా 10 డాలర్లు, నేపాల్ రాష్ట్ర బ్యాంకు రూ.25, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 1 డాలరు, కెనడా రూ.25 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ సూపరింటెండెంట్ బి.వి.వి.ఆర్ ప్రసాద్ పట్నాయక్, సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్ రవికుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్ చక్రవర్తి, ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు పర్యవేక్షించారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

విశిష్ట చిత్రకారులు వడ్డాది పాపయ్య

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారుల్లో పోటీ దక్కించుకున్న తొలితరం చిత్రకారుడు వడ్డాది పాపయ్య అని, ఆయన జిల్లాలో పుట్టడం జిల్లాకు గర్వకారణమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీ సుమిత్ర కళా సమితి ఆధ్వర్యాన నగరంలోని బాపూజీ కళామందిర్‌లో వడ్డాది పాపయ్య శతజయంతి ఉత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావులు ఈ గడ్డపై జన్మించారని, వారు పుట్టిన చోట మనం పుట్టడం ఎంతో అదృష్టమన్నారు. వారి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేసాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన పేరుతో ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక సంస్థ సుమిత్ర కళాసమితి శత జయంతుత్సవాలను నిర్వహించడంతోపాటు కళా, సేవారంగాల్లోని వారికి ఆయన పేరుతో పురస్కారాలను అందించడం ప్రశంసనీయమన్నారు. ఆయన వారసులను సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ సుమిత్ర కళాసమితి వ్యవస్థాపకులు ఇప్పిలి శంకరశర్మ, కార్యదర్శి గుత్తు చిన్నారావు, సభ్యులు మండలపు రవి, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


వడ్డాది వారసులను సత్కరిస్తున్న మంత్రి ధర్మాన

యువజనోత్సవాలకు మోనాలిసా దాస్ ఎంపిక

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

జాతీయస్థాయి యువజన ఉత్సవాలకు శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీకి చెందిన మోనాలిసా దాస్ ఎంపికైంది. ఈసందర్భంగా ఆమె ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈమె ఈ నెల 29న విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాల్లో ఒడిస్సీ నృత్య పోటీల్లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుని, జాతీయ స్థాయికి ఎంపికైంది. ఇప్పటి వరకు జరిగిన పోటీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన నృత్య ప్రదర్శనతో అందరినీ కట్టిపడేసింది. ఆమెకు దేవాదాయ ముఖ్య కార్యదర్శి జి.వాణీమోహన్ ప్రశంసాపత్రం, అవార్డును అందజేశారు. దాస్ తల్లి మనోజ్ మంజరి తెలుగుచదువు పాఠశాలలో ఒరియా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు, తండ్రి లక్ష్మణ్‌కుమార్ దాస్ డాన్స్ మాస్టర్. బరంపురంలో ఒరియా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆమె ఎంపికపై డాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు చిన్న గురుస్వామి, నృత్య దర్శకులు శృతి పట్నాయక్, చిన్నారుల తల్లిదండ్రులు స్థానికులు అభినందనలు తెలియజేశారు.


మోనాలిసా దాస్

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

కంచిలి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు సాధించిన కంచిలికి చెందిన నల్లాన రవిని స్థానిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్, హెచ్ఎం పురందర బిసాయిలతో పాటు గ్రామ పెద్దలు సాలువతో సత్కరించి అభినందించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి రవి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరరావు, ఢిల్లీరావు, నాగరత్నం, గ్రామస్తులు సోమేశ్వరరావు, వి.దుర్యోధన, రూపవతి, తదితరులు పాల్గొన్నారు.


రవిని సత్కరిస్తున్న ఎంఇఒ

క్యాంపస్ డ్రైవ్‌కు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-టెక్కలి రూరల్

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన క్రోల్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో బిటెక్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ.4.5 లక్షల ప్యాకేజీతో వీరు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్‌తోపాటు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్ఒడిలు, తదితరులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం నిర్వహణకు అరసవల్లికి చెందిన వడ్డి లక్ష్మణరావు, ఉమ దంపతులు రూ.రెండు లక్షల విరాళాన్ని అందజేశారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఇఒ వి.హరి సూర్యప్రకాష్‌ను శుక్రవారం కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


విరాళాన్ని అందజేస్తున్న లక్ష్మణరావు దంపతులు


చంద్రబాబును అరెస్టు చేయాలి

టెక్కలి రూరల్: కందుకూరు ఘటనలో చంద్రబాబును ప్రథమ ముద్దాయిగా చేర్చి తక్షణమే అరెస్టు చేయాలని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డి బోయిన గురునాథ్ యాదవ్ డిమాండ్ చేశారు, శుక్రవారం అయ్యప్పనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటువంటి శవ రాజకీయాలు చంద్రబాబుకు కొత్త కాదని గోదావరి పుష్కరాల్లో డ్రోన్‌తో చిత్రీకరణ చేస్తూ 28 మంది మరణానికి కారకులయ్యారని ఆరోపించారు, వికేంద్రీకరణకు వ్యతిరేకంగా అచ్చెన్నాయుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అచ్చెన్న తన పదవికి రాజీనామా చేసి, తనపై గెలవాలని ఛాలెంజ్ విసిరారు. ఆయనకు డిపాజిట్లు లేకుండా ఓడిస్తానని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, యాదవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు

డిసిసిబి సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - బూర్జ

డిసిసిబి సేవలను సద్వినియోగించుకోవాలని బ్రాంచ్ మేనేజర్ పి.బాబ్జీ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో డిసిసిబి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని, ప్రతి ఒక్కరూ బ్యాంక్ సేవలను వినియోగించుకొని రైతులు పంట రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, ల్యాండ్ డెవలప్మెంట్ రుణాలు పొందాలన్నారు. సమావేశంలో డిసిసిబి సూపర్‌వైజర్ జనార్ధననాయుడు, మనోహర్, పిఎసిఎస్ సిఇఒ శాస్త్రి, పిఎసిఎస్ సిబ్బంది జగన్మోహన్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాబ్జీ

పవన్ బహిరంగ సభకు భూమి పూజ

ప్రజాశక్తి - లావేరు

మండలంలోని తాళ్లవలస పంచాయితీలోని వేదమాత లే అవుట్‌లో జనవరి 12న జరగనున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బహిరంగ సభకు ఎచ్చెర్ల జనసేన నాయకులు కాంతిశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ నిర్వహించారు యువశక్తి యూత్ ఫెస్టివల్ పేరుతో జరుగనున్న బహిరంగ సభను విజవంతం చేయాలని ఆమె కోరారు. 27 ఎకరాల్లో ఐదు లక్షల మందితో సమావేశం ఏర్పాటుకు శరవేగంగా పార్టీ శ్రేణులు సమాయత్తం అవుతున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు విశ్వవిక్షణ్, జనసేన మండల నాయకులు కోలా రాజేష్, దుర్గారావు, గోపాల్, కె.పవన్, తదితరులు పాల్గొన్నారు


భూమి పూజ చేస్తున్న కాంతిశ్రీ

పిఎసిఎస్ సిఇఒకు పితృవియోగం

ప్రజాశక్తి - పొందూరు

స్థానిక పిఎసిఎస్ సిఇఒ ఎర్నేన పాపినాయుడు తండ్రి ఎర్నేన అక్కలనాయుడు(90) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సిరిపురం గ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈయన మృతికి డిసిసిబి సిఇఒ వరప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, సభ్యులు బి.శేషగిరి, జి.కృష్ణ, కూన వెంకట సత్యనారాయణ, ఎల్.శ్రీరాములునాయుడు, రమేష్, ప్రసన్నకుమారి, ఎర్నేన ప్రకాశరావు, సిబ్బంది తమ సంతాపాన్ని తెలిపారు.


అక్కలనాయుడు (ఫైల్)

రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల్లో ప్రథమ స్థానంలోకి తీసుకువచ్చి రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గుర్తింపును తీసుకువచ్చారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. పొందూరు మండలం పిల్లలవలసలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉద్యోగ కల్పన లేక నిరుద్యోగం పెరిగిపోయిందని, విపరీతంగా ధరలు పెంపుతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లును అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, నాయకులు కూన వెంకటసత్యనారాయణ, సీపాన శ్రీరంగనాయకులు, చింతాడ కృష్ణవాసుదేవరావు, అన్నెపు రాము, బలగ శంకర భాస్కరరావు, బాడాన శేషగిరినాయుడు, వరదరాజులు, పైడి వాసు, హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎంపిపి పెద్దమురహరిపురం సర్పంచ్ గోరకల వసంతస్వామి అన్నారు. శుక్రవారం పెద్ద మురహరిపురం గ్రామంలో ఇదేం ఖర్మం మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూరాడ మోహన్‌రావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, దాసరి జేజేరావు, గోవింద్ పాపారావు, కుత్తుమ కృష్ణారావు, పోలయ్య, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.


ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నాయకులు

సంస్కరణల వల్ల సత్ఫలితాలు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంస్కరణలు తీసుకొస్తున్నారని, వీటి వల్ల మంచి ఫలితాలు రానున్న రోజుల్లో వస్తాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని చంపాగల్లివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టనష్టాలను తెలుసుకుని వాటిని తీర్చే క్రమంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. జీవన ప్రమాణాల పెంపునకు ఈ సంస్కరణలు దోహదపడతాయన్నారు. వైసిపి జిల్లా కార్యాలయం కోసం భూమి కేటాయించినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారని, గత ప్రభుత్వమే ఇందుకు సంబంధించిన జిఒ ఇచ్చిందన్నారు. గతంలో పేదల కోసం కేటాయించిన భూమిలో టిడిపి కార్యాలయం కట్టుకుంటే ఎందుకు ఆనాడు ప్రశ్నించలేదన్నారు.

కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సచివాలయ కన్వీనర్లే పార్టీ రథసారథులు


ఆమదాలవలస : మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సచివాలయ కన్వీనర్లే వైసిపి రథసారథులని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యాన పార్టీ సచివాలయ కన్వీనర్లు, మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆకాంక్షలకు అనుగుణంగా సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు, జగన్మోహన్‌రెడ్డిని సిఎంగా చేయడమే లక్ష్యంగా ప్రజలతో మమేకమవ్వాలని అన్నారు. ఇప్పటికే వాలంటీర్లు 50 కుటుంబాలకు సేవలు అందిస్తున్నారని వారిని సమన్వయం చేసుకొని సిఎం కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా పరిపాలనను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కన్వీనర్లపై ఉందన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మూడున్నరేళ్లగా జరిగిన అభివద్ధి, సంక్షేమం ప్రజల ముందు ఉంచేందుకే సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా ఐక్యత రాగంతో, రానున్న ఎన్నికల కోసం ఇప్పటి నుండే పనిచేయాలని సూచించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను ప్రజలు పట్టించుకోరన్నారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు సోమరాజు తేజ, గురుగుబెల్లి నీలారావు, కనుగుల కిషోర్, చిలకలపల్లి సురేష్, ఎన్ని రామచంద్రరావు, సైలాడ దాసునాయుడు, దశరథ, చల్ల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: వైస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంగా గెలిపించాలని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారదర్శకతకు నిలువెత్తు నిదర్శనం జగన్ అని కొనియాడారు. కన్వీనర్‌లతో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకొని ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, వెంకటరావు, మధుకేశవరావు, నారాయణ, బాలరాజు, గోవిందరావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: రానున్న ఎన్నికల్లో వైసిపిని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కమలా కళ్యాణ మండపంలో నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ పివిఎన్ సూర్యనారాయణ ఆధ్వర్యాన కన్వీనర్లు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లు సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, పల్లి యోగి, సవర ఆదినాయుడు, బాలరాజు, వాసు, కన్నబాబు, జయమునిరావు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న సీదిరి అప్పలరాజు



బృందాన్ని అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

భూ పరిరక్షణ వల్లే మనుగడ

నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

భూ పరిరక్షణకు మానవ జాతి నడుం బిగించాలని, అప్పుడే పర్యావరణ సమతుల్యత సాధ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. మహారాష్ట్రలోని ఉద్గార్‌కు చెందిన 40 మంది సభ్యులు ఒడిశాలోని పూరీ వరకు భూ పరిరక్షణ పేరిట సైకిల్‌యాత్ర చేపట్టారు. వారికి ఇంటాక్, లైన్స్ క్లబ్ ప్రతినిధులు నగరంలోని ఒక హోటల్‌లో ఆతిథ్యమిచ్చారు. పూరీ వెళ్లేందుకు శుక్రవారం ఇక్కడ నుంచి బయలుదేరిన బృందాన్ని అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజల్లో మరింత అవగాహనకు సైకిల్‌యాత్ర దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హోటల్ యాజమాని వరదా ఆనంద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, జగన్నాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు. బృందం సభ్యులు మాట్లాడుతూ 1400 కిలోమీటర్ల యాత్రను అందరి సహకారంతో పూర్తి చేయగలుగుతున్నామని చెప్పారు. వస్త్రం, కాగితంతో తయారు చేసే వస్తువులను వినియోగించాలని సేవ్ సాయిల్ నినాదాలు చేస్తూ ప్రచారయాత్ర పూరీ వైపు సాగిస్తున్నామన్నారు.

మిరపలో తామర పురుగు ఉధృతి

ప్రజాశక్తి- రణస్థలం

ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మిరప పంట పూత దశలో నల్ల తామర పురుగు ఆశించి పంటను నాశనం చేస్తోందనిఅనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం జీవ నియంత్రణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రణస్థలం మండలంలోని వి.ఎన్.పురం గ్రామంలో మిరప పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పంటలపై రసాయనిక మందులు విరివిగా ఉపయోగించడం వల్ల మిరప పూతలో తామర పురుగులు వంటి కొత్తరకం పురుగులు ఆ మందులకు నిరోధక శక్తిని పెంచుకుంటున్నాయని, అందువలనే ఎన్ని మందులు పిచికారీ చేసినా వాటిని నియంత్రించ లేకపోతున్నామని అన్నారు. అందువలన రైతులు ప్రస్తుత పరిస్థితుల దష్ట్యా జీవ నియంత్రణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని రైతులకు సూచించారు. మిరప పంటలో బవేరియా వంటి పలు రకాల జీవనియంత్రణ మందుల పిచికారీపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించామని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు పి. తవిటినాయుడు, పి.రమణ, కె.మనోజ్ కుమార్, రైతుమిత్రలు రెడ్డి గోవిందరావు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.


మందుల పిచికారీని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎంపీ రామ్మోహన్‌నాయుడు పరామర్శ

ప్రజాశక్తి - పలాస

పలాస మండలం గురుదాస్‌పురం గ్రామంలో టిడిపి పలాస మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్ తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు శుక్రవారం పరామర్శించారు. అనంతరం చిన్న నీలావతి గ్రామంలో పుచ్చ భాస్కరరావు తల్లి, బొడ్డపాడు మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్ తల్లి బొడ్డు గంగమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఎంపీ పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, జిల్లా తెలుగు యువత నాయకులు మెండ దాసునాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఎమ్మెల్సీ దువ్వాడ పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన గ్రామానికి చెందిన తెగలవలస రామలింగం కోడలు ధరణి ఇటీవల మృతిచెందింది. ఆమె కుటుంబానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించి, సంతాపం తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెగలవలస భాస్కరరావును, అనారోగ్యంతో బాధపడుతున్న రామ్మూర్తిపేటకు చెందిన కెల్లి గడ్డెన్నను పరామర్శించారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దువ్వాడతో పాటు చిన్నసాన సర్పంచ్ ప్రతినిధి బి.యల్లయ్య, జియ్యన్నపేట సర్పంచ్ బలగ సూర్యారావు, పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఈనెల 22వ తేదీన శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని కొర్లకోట గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పాత్రుని పాపారావు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చి ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ జలుమూరు రవిబాబు, సెక్రటరీ పి. తేజ లక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాత్రుని పాపారావు

అంచనా బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి -కొత్తూరు

మండల పరిషత్ అంచనా బడ్జెట్‌ను ఎంపిపి సావిత్రి అధ్యక్షతన శుక్రవారం ఆమోదించారు. మండల పరిషత్ సమావేశంలో సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మొత్తం బడ్జెట్ రూ.56,11,8,800 కాగా, వ్యయం రూ.56,08,51,300, రాబడి 56,08,47,300 అంచనా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ప్రత్యేక ఆహ్వానితులు ప్రశాంత్‌కుమార్, జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, వైస్ ఎంపిపి తులసివరప్రసాదరావు, పావని, మాధవి, త దితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పలాస

ఐటిడిపి పలాస మండల అధ్యక్షుడు అరియాపల్లి ప్రభుదాస్ రూపొందించిన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఫొటోతో నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మాజీ మంత్రి గౌతు శివాజీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బలోపేతం కోసం ఐటిడిపి కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో గౌతు శిరీష గెలుపు కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. వాల్‌పోస్టర్‌లను నియోజకవర్గం మొత్తం అంటించి తన అభిమానాన్ని చాటుకున్న ప్రభుదాస్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిరికట్ల విఠల్, కుత్తుం లక్ష్మణరావు, కిక్కర డిల్లీ రావు ,నవిన్ యాదవ్,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌతు శివాజీ

మదుపాం సర్పంచ్‌కు సన్మానం

జి.సిగడాం: సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మదుపాం సర్పంచ్ బి.అప్పలనాయుడును శుక్రవారం సన్మానించారు. టిడిపి మండల అధ్యక్షులు కె.రవికుమార్ ఆధ్వర్యాన అభినందనసభ నిర్వహించారు. అప్పలనాయుడు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికకావడం జి.సిగడాం మండలానికి గుర్తింపు లభించిందని అన్నారు. కార్యక్రమంలో బుజ్జి, ముత్యాలరావు, గొల్లాజి, చిన్న, బంగారునాయుడు, మౌళీశ్వరరావు, కూర్మారావు, హరి, తెలుగుదేశం పార్టీ సర్పంచులు,ఎంపిటిసిలు పాల్గొన్నారు.


అప్పలనాయుడును సత్కరిస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాదంలో కెజిబివి ప్రిన్సిపాల్ మృతి

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని వైకుంఠపురం సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్ ప్రమాదంలో కెజిబివి ప్రిన్సిపాల్ మండాల శ్రీదేవి(38) మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం పాలకొండ పట్టణానికి చెందిన ఈమె ఎల్.ఎన్.పేట మండలం కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం పాలకొండ నుండి ఆమాదాలవలస వైపు వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను శ్రీకాకుళం మెడికవర్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమించి మృతిచెందారు. రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. ఇన్‌ఛార్జి ఎస్ఐ కృష్ణప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీదేవి (ఫైల్)

ఉప తహశీల్దార్ అరెస్టు

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని కర్లేమ్మ రైతు భరోష్ కేంద్రంలో వ్యవసాయ సహాయకురాలిగా పని చేస్తున్న రత్నాల లక్ష్మి కళ్యాణిని ఉప తహశీల్దార్ కొప్పల బాలకృష్ణ పెళ్లి చేసుకుంటానని మోసం చేశారు. ఈ నెల 27న బాధితురాలి ఫిర్యాదుమేరకు పోలీసులు సమగ్ర దర్యాప్తు చేశారు. శుక్రవారం ఆయనను అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ గోవింద్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి - జలుమూరు

ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 1గంటల నుంచి తన భర్త ముచ్చేటి వాసుదేవరావు పెరుగు తీసుకుని రావడానికి ఇంటి నుండి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని చల్లవానిపేటకు చెందిన ముచ్చేటి దేవి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. కనిపించకుండా పోయిన రోజు నుండి నేటి వరకు బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.


వాసుదేవరావు (ఫైల్)

ట్రాక్టర్ దగ్ధం

బూర్జ: మండలంలోని జీడివలస సమీపంలోని పొలంలో గడ్డిని లోడు చేస్తున్న సమయంలో ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో దగ్ధమైంది. అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవరు పిల్ల కృష్ణ మల్లేశ్వరరావు ఇంజిన్‌ను వేరుచేశారు. మంటలను ఆర్పే ప్రయత్నంచేశాడు. అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేశారు. గడ్డితో పాటు ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైంది.


మంటలను ఆర్పుతున్న రైతులు

'ఉపాధి'ని వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి: ఉపాధి హామీని కూలీలు సద్వినియోగించుకోవాలని మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. ఆయన శుక్రవారం కోటబొమ్మాళికి చెందిన కల్లి విశ్వనాథంరెడ్డి మామిడితోటలో ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ రోజుకు 6గంటలు పనిచేసి రోజువారీ కూలి రూ.255లు వచ్చేలా పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జి.రమేష్, కమ్మకట్టు రమణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి
www.prajasakti.com

సంక్షేమమే ఊపిరిగా పాలన


కరపత్రం అందిస్తున్న దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ప్రజా సంక్షేమమే ఊపిరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జనరంజక పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం టెక్కలి మేజర్ పంచాయతీ కుమ్మరి వీధిలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలకన్నా ఎంతో భిన్నంగా పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అట్ల జరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత, మండల నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

'ఐతమ్' నృత్య బృందం ప్రతిభ

టెక్కలి రూరల్: సాంకేతిక విద్యతో పాటు విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న కళలను సైతం వెలికి తీయాలన్న లక్ష్యం దిశగా టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల పరుగులు తీస్తోంది. ఐతమ్ విద్యార్థులు ప్రతి ఏడాది చదువుతో పాటు ఆట పాటల్లో తమ ప్రతిభను చాటుకుంటునే ఉన్నారు. ఈ ఏడాది సైతం విశాఖలో ఐఐఎం నిర్వహించిన 'పినాకిల్-2022' పోటీల్లో భాగంగా బిటెక్ సివిల్, ఈసిఈ కోర్సుల్లో తృతీయ ఏడాది చదువుతున్న 15 మంది భగవతి నాయకత్వంలో ఒక బృందంగా ఏర్పడి డాన్స్ చేసి, ద్వితీయ బహుమతి పొందారు. వారిని డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

లోకనాథం సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి - కవిటి

మాజీ ఎంపిటిసి పొల్లాయి లోకనాథం సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన సంతాప సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకనాథంతో టిడిపికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. తన తండ్రి ప్రకాష్, తనకు ఎన్నికలవేళ అండదండగా నిలిచిన ఆయన అకాల మరణం తనకు వ్యక్తిగతంగా పూడ్చలేనిలోటని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో వైసిపి లీగల్‌సెల్ కార్యదర్శి పులకల శ్రీరాములు, అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షులు పొల్లాయి లక్ష్మణమూర్తి, టిడిపి నాయకులు మనిచంద్ర ప్రకాష్, పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, బాసుదేవ్ రౌలో, బాసుదేవ్ ప్రధాన్, సంతోష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వారిది ఫేక్ సర్పంచ్‌ల సంఘం

ప్రజాశక్తి - జలుమూరు

జిల్లాలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించకుండానే తానే జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడినంటూ ముందుకు వస్తున్నారని, అలాంటివారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు దామ మన్మథరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలోనిది ఫేక్ సర్పంచ్‌ల సంఘం అని, ఆ సంఘంతో తమకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఆయన కేవలం తన ఉనికిని చాటుకునేందుకే పంచాయతీరాజ్ ఛాంబర్‌ను 20 మందితో ఏర్పాటు చేసుకున్నారని అన్నారు.

రైతులకు నష్టపరిహారం


మాట్లాడుతున్న రఘురాం సాహు

పర్లాకిమిడి: ఏనుగుల బీభత్సవం వల్ల చెరకు, వరి పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని జిల్లా అటవీ అధికారి రఘురాం సాహు అన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి అధ్యక్షతన బుధుర పంచాయతీలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, విద్యుత్ విభాగ అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. శియలి సర్పంచ్ రాంప్రసాద్ పట్నాయక్ ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అటవీ అధికారి మాట్లాడుతూ అనుకంపా యాప్ ద్వారా పరిహారం పొందొచ్చని చెప్పారు.

'స్పందన'కు స్పందన కరువు


రైతుల కోసం నిరీక్షిస్తున్న అధికారులు

జలుమూరు: ధాన్యం కొనుగోలులో ఎదురైన సమస్యలపై తహశీల్దార్ బి.సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు నుండి స్పందన కరువైంది. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సాయంత్రం 3గంటల నుండి 5గంటల వరకు నిర్వహించిన ఈ స్పందనకు రైతులు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు రాలేదు. మిల్లర్లు తేమ శాతం ఎక్కువగా ఉందన్న నెపంతో 2 నుండి 5 కేజీల వరకు అధికంగా తీసుకుంటున్నారని గ్రామాల్లో రైతులు ఆరోపిస్తున్నప్పటికీ స్పందనలో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. కార్యక్రమంలో ఎంపిడిఒ జివి.రవికుమార్, ఎంఎఒ కె.సురేష్, సిఎస్‌డిటి బి.గణేష, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: రైతుల కోసం ప్రతి శుక్రవారం సాయంత్రం 3 నుండి 5 వరకు ప్రత్యేక స్పందన నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పి.సరోజని తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలుంటే రైతులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఆమెతోపాటు ఎఒ దానకర్ణుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సిఆర్‌సి లీగల్ అడ్వైజర్‌గా సురేష్ కుమార్


సురేష్ కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్‌గా శ్రీకాకుళం మండలం తండేంవలసకు చెందిన కుంచాల సురేష్ కుమార్‌ను నియమించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యభాస్కరం నియామక పత్రాన్ని అందజేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయ విద్యను పూర్తి చేసుకున్న సురేష్ కుమార్‌కు అవకాశం దక్కింది.


భూ సర్వేపై అవగాహన


మాట్లాడుతున్న రమణారావు

ప్రజాశక్తి-బూర్జ

భూ సర్వేను వినియోగించుకోవాలని తహశీల్దార్ రమణారావు అన్నారు. శుక్రవారం లక్కుపురంలో ఎంపిపి కె.దీప అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన భూ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. భూ సర్వేతో భూములు ఆక్రమణకు గురికావన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ మధుబాబు

ప్రజాశక్తి - జలుమూరు

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వంశధార డిగ్రీ కళాశాల డైరెక్టర్ శాసనపురి మధుబాబు అన్నారు. చల్లవానిపేట సమీపంలోని వంశధార డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్ మధుబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవడనికి అనుక్షణం కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి స్మాల్, మిడ్, లాంగ్ టైం లక్ష్యాలు నిర్దేశించుకుని దానికి అనుగుణంగా ప్రణాళికలు వేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌తో పాటు రిటైర్డ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం, వంశధార డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు చేరువగా డిజిటల్ విద్య


కవిటి : మాట్లాడుతున్న సాయిరాజ్

ప్రజాశక్తి - కవిటి

బడుగు, బలహీనవర్గాలకు డిజిటల్ విద్య చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదని నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని పెద్దకర్రివానిపాలెం ఎంపియుపి పాఠశాల, బొరివంక, ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు సాయిరాజ్, నర్తు రామారావు బైజుస్ ట్యాబ్‌లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు కార్పొరేట్ సొబగులు అద్ది, ప్రవేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేశారని కొనియాడారు. కుసుంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ ఊర్మిళ శివ బిసాయి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ కర్రి, గోపయ్య, సర్పంచ్‌లు ఎస్‌పి నారాయణస్వామి, బెందాళం శ్రీరామ్ ప్రసాద్, జి.రమేష్, ఎస్‌పి ప్రవీణ్‌కుమార్, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఎంపిటిసిలు దుద్ది సతీష్, కర్రి పద్మావతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని కె.శాసనాం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో, పురుషోత్తపురం ఎపి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్తు రామారావు, దుక్క లోకేశ్వరరెడ్డి, సల్ల సుగుణ దేవరాజ్, ఎంపిపి బి.పుష్ప, చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, స్వర్ణమణి, రాజేశఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈదుపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఈచ్ఎం సురేష్ పాడి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ శాంకేతిక విద్య చేరువ చేసేందుకు ట్యాబ్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి డి.వివేకానందరెడ్డి, నర్తు ప్రేమ్‌కుమార్, గీతా బెహరా సొసైటీ అధ్యక్షులు రామచంద్ర, బోనమాలి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అందించే విలువైన ఆస్తి చదువే

కోటబొమ్మాళి: పిల్లలకు మనం అందించే విలేవైన ఆస్తి చదువేనని, చదువుతో మనిషిలోనే కాదు, కుటుంబ పరిస్థితుల్లో, సమాజంలో మార్పు వస్తుందని మండల పరిషత్ అధ్యక్షులు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి జెడ్‌పి బాలుర పాఠశాలలో సర్పంచ్ బొమ్మాళి ఇందు ఆధ్వర్యంలో 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి పంకు లక్ష్మి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, ఎంఇఒ గోవిందరావు, నాయకులు బి.మేహస్, శ్రీనివాస్, చిన్నారావు, వినోద్, వాలంటీర్లు పాల్గొన్నారు.

మండలంలోని హరిశ్చంద్రపురం జెడ్‌పి పాఠశాలలో సర్పంచ్ గురువెల్లి కేశవరావు ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి బగాది మాధవి దివాకర్, పూజారి సత్యం, పాఠశాల హెచ్ఎం నూక లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని గొనకపాడు, కర్తలిపాలెం ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి నిమ్మన దాసు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించే దిశగా సిఎం కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గున్నయ్య, కొర్లం సర్పంచ్ ప్రతినిధి రాఘబుడ్డి గణపతి, నాయకులు మరల శంకర్, బుద్ధాన శ్రీకృష్ణ, బా లరాజు, పాపారావు, శ్రీను, సూర్య ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులకు లఖిదాసుపురం సర్పంచ్ ప్రతినిధి బొంగి మోహనరావు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చిలుకు కృష్ణారావు, పిరియా ధర్మారావు, తులసిప్రసాద్, ఆర్.రామారావు, బి.రత్నం, ప్రియదర్శిని పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: ట్యాబ్‌లతో విప్లవాత్మక మార్పుకు సిఎం జగన్ నాంది పలికారని సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పాత మేఘవరం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సూరాడ రాజారావు, హెచ్ఎం యుడివి ప్రసాదరావు, సూరాడ జోగారావు, మంకు సింహాచలం, సిరిగిడి లక్ష్మి, కె.విద్యా, విఆర్‌ఒ సాయికుమార్, ఎం.వెంకటరావు, పి.భావని, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నౌపడ: సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు, సీతానగరం, దండు గోపాలపురం గ్రామాల్లో విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. భావనపాడులో సర్పంచ్ మోహన్ రెడ్డి, సీతానగరంలో సర్పంచ్ ప్రతినిధి నౌపడ పిలక రవికుమార్‌రెడ్డి, హెచ్ఎం మధు పంపిణీ చేశారు. దండు గోపాలపురంలో మార్పు నాగభూషణం, కోత సతీష్ ద్వారా హెచ్ఎం జానకి రామయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ కమిటీ చైర్మన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట

గార: ప్రతిఒక్కరూ చదువుకోవాలనే లక్ష్యంతో విద్య కోసం పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. మండలంలోని వాడాడలో జెడ్‌పి ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కార్యక్రమంలో ఎనిమిదో తరగతి విద్యను అభ్యసిస్తున్న 16 మంది విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు, టెక్నికల్ నాలెడ్జ్ పెంపొందించుకునేందుకు ట్యాబ్‌లు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ, ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, సుంకాన సురేష్, ముంజేటి కృష్ణమూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : ట్యాబ్‌లతో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు


నౌపడ : ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న రవికుమార్‌రెడ్డి


సోంపేట : గొనకపాడులో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎంపిపి

రాష్ట్రాభివృద్ధే 'యువ గళం' లక్ష్యం

వైసిపి పాలనపై ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం

ప్రజాశక్తి - కవిటి

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసమే 'యువ గళం' పేరుతో నారా లోకేష్ పాదయాత్ర చేపట్టనున్నట్లు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. 'యువ గళం'కు మద్దతుగా టిడిపి నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఎన్‌టిఆర్, అంబేద్కర్ విగ్రహాలకు శుక్రవారం పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రామయ్యపుట్టుగ గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూల్చివేతలతో పాలన ప్రారంభించిన జగన్మోహన్‌రెడ్డి కలెక్టర్లకు కూడా ప్రతిపక్షాలను నిర్దాక్షణ్యంగా బూతులు తిట్టండని చెప్పడం ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకీ పెరిగిపోతున్న ప్రభుత్వ వ్యతిరేకతను కప్పిపుచ్చుకోలేక చివరికి ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రతిపక్షాలను తిట్టమని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. యువత, నిరుద్యోగుల కోసం ప్రతి ఏడాదీ జనవరి 1వ తేదీన జాబ్ క్యాలండర్ ప్రకటిస్తానని చెప్పి, మాటమార్చి, మడమతిప్పి, మొహం చాటేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఒకప్పుడు మిల్లర్లే రైతుల వద్దకు వచ్చి ధాన్యం కోసం బతిమిలాడే వారిని, ఇప్పుడు మా ధాన్యం పట్టుకెళ్లండి బాబు అని రైతులు మిల్లర్లను బతిమాలుకొనే పరిస్థితి తీసుకొచ్చారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు అధికారంలోకి వచ్చాక పింఛన్లు పెంచుకుంటూ పోతానని చెప్పి, ఇప్పుడు పింఛన్లు తుంచుకుంటూ పోతున్నారని ఎద్దేవా చేశారు. డిఎస్‌సి, ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. ఇటువంటి పరిస్థితుల నడుమ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా నారా లోకేష్ జనవరి 27న యువ గళం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పాదయాత్రకు అన్ని వర్గాలు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అనంతరం కందుకూరు ఘటనలో మృతులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు మనిచంద్ర ప్రకాష్, నాయకులు పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, బెందాళం విజయ్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, కోర్రాయి వాసుదేవరావు, పుల్లట సంతోష్, బాసుదేవ్ ప్రధాన్, బార్ల చినబాబు, కొరికాన కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.


కవిటి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

పలాస: జనవరి 27న కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు సాగే యువ గళం పాదయాత్రకు మద్దతుగా యువత నిలవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, పి.విఠల్ రావు కోరారు. కాశీబుగ్గ కెటి రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవిన్, గాలి కృష్ణారావు, ఎ.కృష్ణమూర్తి, చంద్రరావు, గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాల్లో పాలుపంచుకునేందుకే 'యువగళం'

శ్రీకాకుళం అర్బన్ : వైసిపి ప్రభుత్వం అన్ని తరగతుల ప్రజలను నమ్మించి మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. ఏడు రోడ్ల కూడలిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టబోయే పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ సంఘీబావ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు చంద్రబాబు ప్రభుత్వం రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇచ్చిందని, వైసిపి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని రద్దు చేశారని తెలిపారు. యువతకు మనో ధైర్యాన్ని కల్పించి అండగా నిలిచేందుకు రాష్ట్రంలో లోకేష్ పాదయాత్ర చేయబోతున్నారని చెప్పారు. ఈ యాత్రకు యువత అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నాగార్జున ప్రతాప్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, రూరల్ మండల అధ్యక్షులు శీర రమణయ్య, మీడియా కోఆర్డినేటర్ జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులతు వావిలపల్లి సీతారాంబాబునాయుడు అన్నారు. తొలుత టిడిపి కార్యాలయంలో కందుకూరు ఘటనలో మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో లంక జగన్నాథనాయుడు, చొక్కర పోలినాయుడు, వెంకటప్పలనాయుడు, రాంబాబు, గోవిందరావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం : ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టిడిపి శ్రేణులు

టెక్కలి: యువకుల్లో చైతన్యం నింపేందుకు లోకేష్ చేస్తున్న పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో హెచ్.రామకృష్ణ, పి.షణ్ముఖరావు, ఎం.పురుషోత్తం, బెహరా కాళీ, దమయంతి, చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, లవకుమార్, ప్రతీష్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: లోకేష్ పాదయాత్రున విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ అన్నారు. స్థానిక కలమట కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్ 400 రోజులు 4వేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నట్లుచెప్పారు. సమావేశంలో పి.మోహనరావు, అరుణ్‌కుమార్, గాంధీ, ఎల్.భగవాన్‌దాస్‌నాయుడు, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

లావేరు: లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయాలని లావేరు కూడలిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులుముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ తోటయ్యదొర, వెంకటరమణ, మధుబాబు, శ్రీనివాసరావు, కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కాళ్ల ధర్మారావు కోరారు. తన నివాసం వద్ద కందుకూరు ఘటనలో మృతులకు నివాళులర్పించారు. సమావేశంలో నాయకులు దక్కత ఢిల్లీరావు, జయదేవ్, శంకరరెడ్డి, లీలారాణి, ఆర్.జానకిరావు పాల్గొన్నారు.



పలాస : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టిడిపి నాయకులు


లావేరు : ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టిడిపి నాయకులు


కొత్తూరు : మాట్లాడుతున్న సాగర్

ఆధునిక జీవనశైలికి సూచీలు జగనన్న కాలనీలు


మాట్లాడుతున్న కమిషనర్ రవిసుధాకర్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆధునిక జీవనశైలికి చిరునామాలుగా జగనన్న కాలనీలు రూపుదిద్దుకోనున్నాయని కమిషనరు ఎం.రవిసుధాకర్ అన్నారు. శుక్రవారం చింతాడ వార్డు సచివాలయంలో జగనన్న కాలనీ లేఅవుట్ లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల విషయమై పురపాలక సంఘం పరిధిలో ఉన్న తిమ్మాపురం, గాజుల కొల్లివలస, చింతాడ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు. ఇప్పటికైనా సందిగ్ధత వీడి నిర్మాణాలకు ముందుకురావాలని సూచించారు. హౌసింగ్ డిఇ మోహనరావు మాట్లాడుతూ నిర్మాణాలకు ముందుకువచ్చిన వారికి ఎప్పటికప్పుడు ప్రభుత్వం ద్వారా బిల్లుల చెల్లింపు జరిగేలా చూస్తామని చెప్పారు. ప్రభుత్వం ఎంతో గొప్ప ఆశయంతో కల్పించిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ డి.సన్యాసిరావు, వార్డు పెద్దలు బి.చిన్నంనాయుడు, బి.రమణయ్య, సిహెచ్ వెంకటరమణ, జి.లక్ష్మణ, జగన్, సచివాలయ అడ్మిన్ అన్నెపు ఉమామహేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, ఆర్పీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లెవీ పెంచాలని వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైస్ మిల్లర్లు

ప్రజాశక్తి - కంచిలి

ధాన్యం లెవీ లక్ష్యం పెంచాలని కంచిలికి చెందిన రైస్ మిల్లర్లు తహశీల్దార్ హైమావతిని కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రైస్ మిల్లర్లు, మండల స్థాయి అధికారులతో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌బికె కేంద్రాల ద్వారా రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు జరపడం జరుగుతుందన్నారు. తమకు కేటాయించిన లేవీ లక్ష్యం పెంచాలని రైస్ మిల్లర్లు కోరడంతో పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన రైస్ మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

పంటను కాపాడుకునేందుకే కంచె

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అడవి పందుల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు కంచె వేశామని పట్టుపురం రైతులు కొండల అమ్మన్న, కె.మహాలక్షమ్మ, సిహెచ్ సింహాచలం తెలిపారు. ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకొని, కంచె వేశారన్న ఆర్‌డిఒకు ఫిర్యాదుపై విఆర్‌ఒ శుక్రవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పంటలను కాపాడుకునేందుకు కంచె వేశామన్నారు. విఆర్‌ఒ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎప్పుడు స్థలం అవసరమైనా వీటిని తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. దీనికి రైతులు అంగీకరించారు.